సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం । 13 । జూలై । 2024



భళా.. విత్తనాభివృద్ధి సంస్థ !
రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విత్తన వ్యాపారం చేసి ముందంజలో నిలిచింది.
8లో



సీఎంను కలిసిన ఎమ్మెల్యేలు
రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పలువురు ఎమ్మెల్యేలు కలిసి ప్రజా సమస్యలు విన్నవించారు.
8లో

గరిష్టం / కనిష్టం
30° / 25°
వాతావరణం
జిల్లాలో శనివారం ఉదయం వాతావరణం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రాజాకుమార్

కొత్తగూడెం రూరల్: కొత్తగూడెం ప్రభుత్వ మెడికల్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె.రాజాకుమార్‌ను నియమించారు. ఇన్నాళ్లు ప్రిన్సిపాల్‌గా ఉన్న లక్ష్మణ్‌రావును హైదరాబాద్ బదిలీ చేసిన విషయం విదితమే. ఆయన స్థానంలో పాథాలజీ విభాగం ప్రొఫెసర్ రాజాకుమార్‌ను ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి.

స్వర్ణకవచధారణలో రామయ్య..



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలోని అంతరాలయంలో మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలను గావించారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి)ఆలయంలో శుక్రవారం అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేక పూజలు, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమపూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎస్.రజనీకుమారి, భక్తులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం జరగాలి



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: నేరస్తులకు త్వరితగతిన శిక్ష పడేలా, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పోలీసులు విధులు నిర్వర్తించాలని ఎస్పీ రోహిత్‌రాజు ఆదేశించారు. శుక్రవారం కొత్తగూడెం రైటర్‌బస్తీలోని ఐఎంఏ హాల్‌లో జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు అధికారులకు తెలపాలని, సందేహాలు తలెత్తితే డీసీఆర్బీ అధికారుల ద్వారా నివృత్తి చేసుకోవాలని వివరించారు. కేసు నమోదు నుంచి కేసు పూర్తయ్యే వరకు ప్రతీ విషయాన్ని ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. ఈ సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, సీఐలు మల్లయ్యస్వామి, శ్రీనివాస్, నాగరాజు, బత్తుల సత్యనారాయణ, సంజీవరావు, అశోక్, వెంకటేశ్వర్లు, ఎం.కరుణాకర్, టి.రమేష్‌కుమార్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

సింగరేణి(కొత్తగూడెం): వర్షంతో సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో ఏరియాలో 10 వేల టన్నుల బొగ్గు ఉత్పతికి అంతరాయం వాటిల్లింది. రోజూ 40 వేల టన్నుల ఉత్పత్తి సాధించాల్సి ఉండగా, శుక్రవారం 30 వేల టన్నులే వెలికితీశారు. వర్షపునీటితో ఓసీ క్వారీల్లో హాల్ రోడ్లన్నీ బురదమయంగా మారాయి. శుక్రవారం మధ్యాహ్నం తర్వాత రోడ్లను చదును చేసి, బొగ్గు ఉత్పత్తి ప్రారంభించారు.

పెద్దాస్పత్రికి సుస్తీ!



జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రి

మెడికల్ కళాశాల చుట్టూ వివాదాలు
- సర్వజన ఆస్పత్రిపై అవినీతి మరకలు
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఏజెన్సీ జిల్లాకు వచ్చిన మెడికల్ కాలేజీ తొలి ఫలాలు ప్రజలకు అందకముందే వివాదాలు ముసురుకుంటున్నాయి. పరిస్థితిని చక్కదిద్దేందుకు మెడికల్ కళాశాల, బోధనాసుపత్రుల్లో నెలకొన్న సమస్యలపై ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

వివాదాల నడుమ ప్రిన్సిపాల్ బదిలీ

కొత్తగూడెం మెడికల్ కాలేజీ మొదటి ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌ఎల్ లక్ష్మణ్‌రావు అనేక వివాదాల నడుమ ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిపోయారు. కాలేజీ నిర్వహణలో లోపాలతోపాటు నిధులు ఖర్చు చేసిన విధానంపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. దీనికి తోడు ప్రిన్సిపాల్ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ కళాశాల విద్యార్థినులు ఇటీవల ధర్నా చేపట్టారు. వీటన్నింటిపై విచారణ చేపట్టిన ప్రభుత్వం చివరకు లక్ష్మణ్‌రావును ప్రిన్సిపాల్ పోస్టు నుంచి తప్పించి, బదిలీ చేసింది.

సర్వజన ఆస్పత్రిలోనూ అవినీతి ఆరోపణలు

మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న సర్వజన ఆస్పత్రిలోనూ సూపరింటెండెంట్ కుమారస్వామికి ఈ తరహా పరిస్థితులే ఎదురయ్యాయి. టెండర్లు పిలవకుండా ఔషధాలు, లైబ్రరీలో పరికరాలను కొనుగోలు చేశారు. ఆస్పత్రి ఆవరణలో అదనపు గదుల నిర్మాణం చేపట్టారు. మొత్తంగా రూ 1.30 కోట్ల నిధుల వినియోగంలో గోల్‌మాల్ జరిగిందనే ఆరోపణలు వచ్చాయి. మరోవైపు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో చేపట్టిన ఉద్యోగ నియామకాలు వివాదాస్పదంగా మారాయి. వీటికి తోడు ఈ ఆస్పత్రిలో 2021లో చోటుచేసుకున్న కరోనా మరణంపై కోర్టులో జరుగుతున్న విచారణకు కుమారస్వామి గైర్హాజరు కావడంతో పరిస్థితి మరింత దిగజారింది. చివరకు ఆయన్ను సూపరింటెండెంట్ పోస్టు నుంచి అప్పటి కలెక్టర్ ప్రియాంక ఆల తప్పించారు.

కొరవడిన పర్యవేక్షణ

ఏజెన్సీ జిల్లా వాసులు అత్యవసర, ఆధునిక వైద్య సేవల కోసం ఖమ్మం, వరంగల్, హైదరాబాద్ వంటి పట్టణాలపై ఆధారపడే పరిస్థితి నెలకొంది. ఈ తరుణంలో 2022లో భద్రాద్రి జిల్లాలో మెడికల్ కాలేజీ ప్రారంభం కావడంతో మెరుగైన వైద్య సేవలు అందుతాయనే నమ్మకం జిల్లా వ్యాప్తంగా కలిగింది. అయితే మెడికల్ కాలేజీ, బోధనాసుపత్రి నిర్వహణపై ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారించకపోవడం వల్ల కేవలం రెండేళ్లలోనే ఇటు కాలేజీ అటు ఆస్పత్రిని వివాదాలు చుట్టుముట్టాయి. కాలేజీ ప్రారంభమై రెండేళ్లు అవుతున్న ఇప్పటికీ కాలేజీ, ఆస్పత్రి నిర్వహణపై సరైన ప్రణాళిక లేదనే విమర్శలు ఉన్నాయి.

వేర్వేరు చోట్ల కళాశాల, ఆస్పత్రులు

ప్రస్తుతం సర్వజన ఆస్పత్రిలో 230 పడకలు అందుబాటులో ఉన్నాయి. భవిష్యత్‌లో 600 పడకల వరకు విస్తరించాల్సిన అవసరం ఉంది. ఇరుకైన ఈ ప్రాంగణంలో ఆస్పత్రి విస్తరణ కష్టంగా మారింది. స్థల లభ్యత లేని కారణంగా ఇటీవల 50 పడకలతో మంజూరైన ట్రామా కేర్ సెంటర్‌ను రామవరం మాతాశిశు ఆస్పత్రి ప్రాంగణంలో నిర్మిస్తున్నారు. రామవరంలో వైద్య సేవలు పొందుతున్న వారు రోగ నిర్ధారణ పరీక్షల కోసం కొత్తగూడెం ఆస్పత్రిపై ఆధారపడాల్సి వస్తోంది. కాలేజీ ఏర్పాటు సమయంలో కొరవడిన స్పష్టత కారణంగా మెడికల్ కాలేజీ పాల్వంచలో, సర్వజన ఆస్పత్రి కొత్తగూడెంలో, మాతాశిశు, ట్రామాకేర్ సెంటర్లు రామవరంలో ఇలా మూడు వేర్వేరు ప్రాంతాల్లోకి వచ్చాయి. వీటన్నింటినీ ఒకే క్యాంపస్‌లో వచ్చేలా ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉంది. లేదంటే రాబోయే రోజుల్లో మెడికల్ కాలేజీ వ్యవహారం అతుకుల బొంతగా మారే ప్రమాదం ఉంది.

మరికొన్ని సమస్యలు
- సర్వజన ఆస్పత్రిలో మూడు ఆపరేషన్ థియేటర్లు ఉండగా కేవలం రెండు మాత్రమే ఉపయోగంలో ఉన్నాయి. మూడో ఆపరేషన్ థియేటర్‌ను అందుబాటులోకి తీసుకువస్తే కంటి ఆపరేషన్లకు ఉపయోగపడుతుంది.
- పాత భవనంపై కొత్తగా చేపట్టిన నిర్మాణాల కారణంగా పాత భవనంలో అనేక చోట్ల డ్రెయినేజీ వ్యవస్థ పాడైంది. దీన్ని పునరుద్ధరించాలి. మొత్తం ఆస్పత్రికి మెరుగైన డ్రెయినేజీ వ్యవస్థను అందుబాటులోకి తేవాలి.
- సర్వజన ఆస్పత్రిలో ఇన్ పేషెంట్లు తక్కువగా ఉంటున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో సీట్ల కోతకు దారి తీసే ప్రమాదం ఉంది. జిల్లా ప్రజలు సర్వజన ఆస్పత్రి సేవలు వినియోగించుకునేలా ప్రచారం నిర్వహించాల్సిన అవసరం ఉంది.

సమీకృత సేద్యంతో అధిక ఆదాయం



కొత్తూరు పాఠశాల ఆవరణలో మురుగునీటి నిల్వని పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

- ఔషధ మొక్కలు విస్తృతంగా పెంచాలి
- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

ములకలపల్లి: సమీకృత సేద్యంతో అధిక ఆదాయం పొందవచ్చని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. మండలంలో శుక్రవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. తొలుత కొత్తూరు గ్రామాన్ని సందర్శించారు. ప్రయోగాత్మకంగా చేపట్టిన మునగ నర్సరీని పరిశీలించి, రైతు కృష్ణ దంపతులను శాలువతో సత్కరించారు. పూసుగూడెంలో ఈదర మురళి చేపట్టిన చేపల పెంపకాన్ని పరిశీలించి మాట్లాడారు.

నేనే పలుగుపట్టి చేసేనా .. ?

కొత్తూరు ప్రాథమిక పాఠశాల ఆవరణలో నీరు నిల్వ ఉండటంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ఇంకుడుగుంత తవ్వి, మురుగునీరు వెళ్లేలా చూడాలన్నారు. 'మీరు చేస్తారా? లేక తానే పలుగు పట్టి తవ్వాలా' అంటూ అధికారులను ప్రశ్నించారు. పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. భవనం శ్లాబ్ పెచ్చులు ఊడిపోతుండటంతో మరమ్మతులకు అంచనాలు సిద్ధం చేయాలని ఐటీడీఏ ఏఈ సుబ్బరాజును ఆదేశించారు. అనంతరం ములకలపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి, శిథిలావస్థకు చేరిన భవనాల మరమ్మతులకు ప్రతిపాదనలు తయారుచేయాలని పీఈఆర్ ఈఈ శ్రీనివాసరావుకు తెలిపారు. విద్యాసంస్థల్లో ఔషధ మొక్కలను పెంచాలని విద్యాశాఖాధికారులను ఆదేశించారు. వాకింగ్ ట్రాక్, వాలీబాల్, షటిల్ కోర్టులు ఏర్పాటు చేయాలన్నారు.

ములకలపల్లి, గుండాల కేజీబీవీలను ఆదర్శంగా తీసుకోవాలి

కేజీబీవీని సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. ఫస్టియర్‌లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థిని రమ్యను అభినందించారు. హాస్టల్‌లో విద్యార్థినులకు పూర్తిస్థాయి రక్షణతోపాటు, ఆరోగ్యం ప్రధానమని అన్నారు. ములకలపల్లి, గుండాల కేజీబీవీలను మోడల్‌గా తీసుకుని అమ్మ ఆదర్శ పాఠశాలల లాగా తీర్చిదిద్దేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఆ తర్వాత రాజుపేట శివారులోని చిలకపాటి కనకదుర్గ, జైచందర్‌రావు దంపతుల వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. సేంద్రియ పద్ధతిలో సేద్యం, తేనెటీగల పెంపకంతోపాటు గేదెలు, ఆవులు, నాటుకోళ్లు, మేకల పెంపకంపై హర్షం వ్యక్తం చేశారు. పశు సంపద పెంపకం వల్ల ఆర్థికంగా స్థిరపడవచ్చన్నారు. పంటమార్పిడి పద్ధతి పాటించాలని, సేంద్రియ ఎరువులను వినియోగిస్తూ అధిక దిగుబడి పొందాలని చెప్పారు. వ్యవసాయ క్షేత్రం కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)ను తలపిస్తోందని కితాబిచ్చారు. చందర్‌రావు దంపతులను దుశ్శాలువతో సత్కరించారు. డీఏఓ బాబూరావు, డీఆర్‌డీఓ విద్యాచందన, జిల్లా అధికారులు సులోచనారాణి, అన్నామణి, ఏడీఏ అఫ్జల్ బేగం, తహసీల్దార్ పుల్లారావు, ఎంపీడీఓ భారతి, ఎంపీఓ లక్ష్మయ్య, ఏఓ కరుణామయి, ఎంఈఓ శ్రీరామ్మూర్తి, ఎస్‌ఓ సక్కుభాయి, ఏఈలు లక్ష్మీనర్సింహారావు, వరప్రసాద్, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతుల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న డైరెక్టర్ లక్ష్మయ్య

పాల్వంచ: కేటీపీఎస్ 5,6 దశల కర్మాగారంలోని 10వ యూనిట్‌లో జరుగుతున్నవార్షిక మరమ్మతులను శుక్రవారం టీజీ జెన్‌కో డైరెక్టర్(థర్మల్) బి.లక్ష్మయ్య తనిఖీ చేశారు. కోల్ ప్లాంట్‌ను పరిశీలించారు. అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనుల్లో అలసత్వం వహించొద్దన్నారు. వ్యవసాయ అవసరాలకు విద్యుత్ అవసరం ఉంటుందని, యూనిట్‌ను సాధ్యమైనంత త్వరగా రాష్ట్ర గ్రిడ్‌కు అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. డైరెక్టర్ వెంట సీఈ ఎం.ప్రభాకర్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పొదెం వీరయ్య బాధ్యతల స్వీకరణ

హాజరైన మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు



రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న వీరయ్య

భద్రాచలంటౌన్: కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని కొండాపూర్ బొటానికల్ గార్డెన్‌లో ఈ కార్యక్రమం జరగ్గా, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు హాజరయ్యారు. భద్రాచలం రామాలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి పొదెంకు ఆశీర్వచనాలు అందజేశారు. పలువురు కాంగ్రెస్ నాయకులు వీరయ్యను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీజీఎఫ్డీసీ ఎండీ, వైస్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, టూరిజం ఈడీ రంజిత్ నాయక్, పినపాక, అశ్వారావుపేట, భద్రాచలం, వైరా ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, డాక్టర్ తెల్లం వెంకట్రావు, రాందాస్ నాయక్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ట్రైకార్ చైర్మన్ డాక్టర్ బెల్లయ్య నాయక్, హస్తకళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యం, మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర తదితరులు పాల్గొన్నారు.

పైనంపల్లి టోల్‌ప్లాజా సిద్ధం



నిర్మాణం పూర్తయిన టోల్‌ప్లాజా

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లి వద్ద టోల్‌ప్లాజా ప్రారంభానికి సిద్ధమైంది. కోదాడ-కురవి జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పైనంపల్లి వద్ద టోల్‌ప్లాజా నిర్మించారు. ఇక్కడ గేట్లు, కేబిన్లు సహా అంతా సిద్ధం చేయగా, రెండు వైపులా బోర్లు సైతం ఏర్పాటుచేసి ట్రయల్ రన్ చేపట్టారు. జాతీయ రహదారి నిర్మాణ పనులు చివరి దశలో ఉన్న నేపథ్యాన త్వరలోనే టోల్‌ప్లాజా వద్ద వసూళ్లు మొదలుకానున్నాయని తెలుస్తోంది.

న్యాయవాదులకు హెల్త్‌కార్డుల పంపిణీ



జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న న్యాయవాదులు

కొత్తగూడెంటౌన్: జిల్లా కోర్టు లైబ్రరీహాల్‌లో శుక్రవారం న్యాయవాదులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న హెల్త్‌కార్డులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 500 మంది న్యాయవాదులకు హెల్త్ కార్డులను అందజేశారు. తొలుత న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ పాల్గొన్నారు.

బాలకార్మికులకు భరోసా..

- బాలలు ఉండాల్సింది బడిలో.. పనిలో కాదు
- ఆపరేషన్ ముస్కాన్‌తో పరిశ్రమలు, దుకాణాల్లో తనిఖీలు
- చిన్నారులను గుర్తించి బడికి పంపుతున్న అధికారులు
- మూడేళ్లలో 211 మంది బాలకార్మికులకు విముక్తి



దుకాణంలో తనిఖీ చేస్తున్న ఆపరేషన్ ముస్కాన్ బృందం (ఫైల్)

కొత్తగూడెంటౌన్: బాలకార్మికులను వెట్టిచాకిరీ నుంచి విముక్తులను చేసేందుకు ప్రభుత్వం ఆపరేషన్ ముస్కాన్‌ను ప్రతిష్టాత్మకంగా చేపడుతోంది. బాలలు బడిలో గడిపాలని, పనిలో కాదని ఈ కార్యక్రమంలో అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఏటా జూలైలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం కూడా ఈ నెల 1న ఆపరేషన్ ముస్కాన్-10 ప్రారంభంకాగా, ఈ నెల చివరి 31 వరకు కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా అధికారులు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. బాలబాలికలను గుర్తిస్తూ, వారితో పనిచేయిస్తున్నవారిపై చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 2021 నుంచి 2024 జూలై 11 వరకు దాదాపుగా 211 మంది బాలబాలికలను గుర్తించి, వారికి విముక్తి కలిగించినట్లు జిల్లా శిశు సంక్షేమశాఖ అధికారి వేల్పుల విజేత తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్ బృందంలో ఐసీడీఎస్, చైల్డ్ వెల్ఫేర్, పోలీస్ శాఖ అధికారులు ఉండగా, సంయుక్తంగా దాడులు నిర్వహిస్తూ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేస్తున్నారు. జిల్లాలోని పలు పరిశ్రమలు, వ్యాపార సముదాయాలు, గోదాములు, మెకానిక్, బేకరీ, బట్టల షాపులు వంటి ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. కొత్తగూడెం, భద్రాచలం, ఇల్లెందు, మణుగూరు, చంద్రుగొండ తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేపడుతున్నారు. బాలకార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులపై కేసులు నమోదు చేస్తున్నారు. గుర్తించిన బాలకార్మికులను తల్లిదండ్రులకు అప్పగించి, కౌన్సెలింగ్ ఇస్తున్నారు. విద్యాబుద్ధులు నేర్పేందుకు పాఠశాలల్లో చేర్పుతున్నారు. అనాథలైతే చైల్డ్ కేర్ హోంలో చేర్చి ఆలనాపాలన చూస్తున్నారు.

- జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్‌తో మూడేళ్లలో దాదాపుగా 211 మంది బాలకార్మికులను గుర్తించారు. 2021లో తెలంగాణకు చెందిన 48 మంది పిల్లలను, ఏపీకి చెందిన ఒకరు, ఇద్దరు చొప్పున ఒడిశా, బిహార్ చిన్నారులు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఒకరిని, జార్ఖండ్‌కు చెందిన ముగ్గురు.. మొత్తం 61 మంది బాలకార్మికులను గుర్తించారు. వీరిలో 57 మంది బాలురు కాగా, నలుగురు బాలికలు ఉన్నారు.
- 2022లో 68 మంది బాలకార్మికులను వెట్టి చాకిరీ నుంచి విముక్తులను చేశారు. వీరిలో 56 మంది బాలురు, 12 మంది బాలికలు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు ఆరుగురు, తెలంగాణ-41, ఒడిశా- 2, బిహార్ -1, ఛత్తీస్‌గఢ్-4, రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు పిల్లలు ఉన్నారు.
- 2023లో 33 మంది బాలకార్మికులను గుర్తించారు. వీరిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ముగ్గురు, తెలంగాణ-17 గుజరాత్ -1, ఛత్తీస్‌గఢ్-4, రాజస్థాన్‌కు చెందిన ముగ్గురు ఉన్నారు. 28 మంది బాలురు ఉండగా, ఐదుగురు బాలికలను బాలకార్మిక వ్యవస్థ నుంచి విముక్తులను చేశారు.
- 2024 ఏడాది ఇప్పటివరకు 16 మందిని బాలకార్మికులను రక్షించినట్లు అధికారులు తెలిపారు.

100, 1098 నంబర్లకు డయల్ చేయాలి



బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా ప్రత్యేకంగా తనిఖీలు చేపడుతున్నాం. బాలకార్మికులను గుర్తించి విముక్తిని కలిగిస్తున్నాం. బాలలతో పనులు చేయించడం చట్టరీత్యా నేరం. జిల్లాలో గత మూడేళ్లలో 211 మందికి పైగా బాలకార్మికులకు విముక్తి కలిగించాం. పరిశ్రమలతోపాటు ప్రతి దుకాణంలో తనిఖీలు చేపడుతున్నాం. బాలకార్మికులతో పనులు చేయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఎవరైనా బాలకార్మికులను గమనిస్తే 100, 1098కు డయల్ చేసి సమాచారం అందించాలి.
–వేల్పుల విజేత, జిల్లా సంక్షేమశాఖ అధికారి

క్లుప్తంగా

రామయ్య సన్నిధిలో ఐఏఎస్ అధికారి



ధ్వజస్తంభం వద్ద యోగితారాణా, ఈఓ తదితరులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి వారిని శుక్రవారం అగ్రికల్చర్, ఫార్మర్స్ వెల్ఫేర్ జాయింట్ సెక్రటరీ, సెంట్రల్ ప్రభారి అధికారి యోగితారాణా దర్శించుకున్నారు. అర్చకులు, ఈఓ ఎల్.రమాదేవి ఆమెకు ఆలయ సంప్రదాయ ప్రకారం స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంత రాలయంలో మూలమూర్తులు, శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారిని దర్శించుకున్నాక పండితులు వేదాశీర్వచనం చేసి ప్రసాదం, జ్ఞాపికలు అందచేశారు. ఈ సందర్భంగా దేవస్థానంలో మాస్టర్ ప్లాన్ ద్వారా చేపట్టనున్న అభివృద్ధి పనులను వివరాలను యోగితారాణాకు ఈఓ వివరించారు. ఆలయ ప్రధాన అర్చకులు విజయరాఘవన్, పొడిచేటి సీతారామానుజాచార్యులు, ఈఈ రవీందర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

సింగరేణి అభ్యర్థులకు హాల్‌టికెట్లు

సాక్షి ఎఫెక్ట్..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఉద్యోగ నియామకాలకు ఈనెల 20, 21 తేదీల్లో పరీక్ష నిర్వహించనుండగా... దరఖాస్తు చేసుకున్న 21 వేల మందిలో 4వేలకు పైగా దరఖాస్తులను తిరస్కరించారనే ప్రచారంతో అభ్యర్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ విషయమై 'సింగరేణి ఉద్యోగ దరఖాస్తులు తిరస్కరణ?' శీర్షికన ఈనెల 10న 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. పరీక్ష నిర్వహణ బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎడ్‌సెల్ సంస్థతో సింగరేణి అధికారులు చర్చించగా దరఖాస్తుల్లో చిన్నచిన్న తప్పిదాలు ఉన్న 3వేల మందికి హాల్‌టికెట్లు జారీ చేసేందుకు నిర్ణయించినట్లు తెలిసింది. మరో వెయ్యి మంది మాత్రం ఫొటో అప్‌లోడ్ చేయకపోవడం, పరీక్ష ఫీజులో రాయితీ కోసం తప్పుడు సమాచారం ఇచ్చిన నేపథ్యాన మరోమారు పరిశీలిస్తున్నట్లు సమాచారం. కాగా, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరికీ హాల్‌టికెట్లు జారీ చేయాలని ఏఐటీయూసీ ఏఐటీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్ తదితరులు శుక్రవారం రిక్రూట్‌మెంట్ సెల్ జీఎం బీఆర్.దీక్షితులుకు విన్నవించారు.

భూ వివాదంపై ఎంపీడీఓ విచారణ



గిరిజన రైతులను విచారణ చేస్తున్న ఎంపీడీఓ

పాల్వంచరూరల్: మండల పరిధిలోని తోగ్గూడెం గ్రామంలో ఆర్‌ఓఎఫ్‌ఆర్ భూమికి సంబంధించిన వివాదంపై శుక్రవారం ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి గ్రామపంచాయతీ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్‌కు చెందిన నాలుగు ఎకరాల భూమిని భగవాన్ అనే వ్యక్తి తన పేరు మీద రాయించుకున్నాడని, అందులో తమకు రెండు ఎకరాలు రావాల్సి ఉందని లకావత్ సోనియా అనే మహిళ ఇటీవల పీఓకు ఫిర్యాదు చేసింది. పీఓ విచారణకు ఆదేశాలు జారీచేయడంతో ఎంపీడీఓ ఇద్దరు గిరిజన రైతులను పిలిపించి వివరాలు తెలుసుకున్నారు. ఎంపీఓ నారాయణ, కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.

బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి

గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్

భద్రాచలంటౌన్: గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఐటీడీఏ డీడీ, డీటీడీఓలను ఆదేశించారు. హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ ఒకేచోట ఐదేళ్లుగా పనిచేస్తున్న హెచ్‌ఎంలు, ఎనిమిదేళ్లుగా పనిచేస్తున్న టీచర్లను తప్పనిసరిగా బదిలీ చేయాలన్నారు. 70 శాతం సమస్య ఉంటేనే మెడికల్ విభాగంలో బదిలీకు వెసులుబాటు కల్పించాలన్నారు. బదిలీ, ప్రమోషన్ల ప్రక్రియను ఆగస్టు 16 వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. అభ్యంతరాలు ఉంటే వారం రోజుల్లో ఉన్నతాధికారుల దృష్టికి తేవాలని, సీనియారిటీ జాబితాలో అవకతవకలు జరిగితే బాధ్యులను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. బదిలీల ప్రక్రియ ఐటీడీఏ పరిధిలోని కమిటీ సభ్యుల ద్వారా చేపట్టాలని, ఐటీడీఏ లేని చోట కలెక్టర్, అదనపు కలెక్టర్ కమిటీ ఆధ్వర్యంలో బదిలీలు చేపట్టాలని పేర్కొన్నారు. ఐటీడీఏ ఏపీఓ డేవిడ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,705

భళా... విత్తనాభివృద్ధి సంస్థ!

- ఈ ఏడాది రూ.8.53 కోట్ల మేర వ్యాపారం
- ఉమ్మడి జిల్లాలో 95 సొసైటీల ద్వారా విక్రయాలు
- సబ్సిడీపై భారీగా పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ
- వరి, అపరాల విత్తనాల అమ్మకంలోనూ జోరు



ఖమ్మంలోని విత్తనాభివృద్ధి సంస్థ కార్యాలయం

ఖమ్మంవ్యవసాయం: తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో రూ.8.53 కోట్ల మేర విత్తన వ్యాపారం చేసి ముందంజలో నిలిచింది. రైతులకు అవసరమైన విత్తనాలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా మంచి స్పందన లభించింది. భూముల్లో సారం పెంచడం, పంటల్లో అధిక దిగుబడి సాధించడం, ఎరువుల వాడకాన్ని తగ్గించేందుకు రైతులు పచ్చిరొట్ట సాగుకు ప్రాధాన్యత ఇస్తారు. ఈమేరకు విత్తనాభివృద్ధి సంస్థ పచ్చిరొట్ట విత్తనాలు భారీగా సమకూర్చడంతో అమ్మకాల్లో గత కొన్నేళ్ల మాదిరిగానే రాష్ట్రంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా అగ్రభాగాన నిలిచింది. ఇక ప్రభుత్వం ఈ ఏడాది సన్న వరి ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించడంతో రైతులు ఆసక్తి చూపుతుండగా విత్తనాభివృద్ధి సంస్థ ఐదు రకాల వరి విత్తనాలను పీఏసీఎస్‌ల ద్వారా విక్రయించింది.

సబ్సిడీపై పచ్చిరొట్ట..

పచ్చిరొట్ట విత్తనాలను 60 శాతం సబ్సిడీపై రైతులకు సంస్థ ద్వారా విక్రయించారు. జీలుగ, జనుము, పిల్లి పెసర పచ్చిరొట్ట విత్తనాలను వివిధ ప్రాంతాల నుంచి తెప్పించి సీజన్‌కు ముందుగానే సహకార సంఘాల ద్వారా అందుబాటులో ఉంచారు. ఉమ్మడి జిల్లాలో రూ.7.83 కోట్ల విలువైన సుమారు 30 వేల క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను సంస్థ విక్రయించింది. ఇందులో సింహభాగం జీలుగ విత్తనాలే ఉన్నాయి.

రూ.57 లక్షల విలువైన వరి..

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుత వానాకాలం విత్తనాభివృద్ధి సంస్థ రూ.57 లక్షల విలువైన ఐదు రకాల వరి విత్తనాలను విక్రయించింది. ప్రధానంగా సాంబమసూరి(బీపీటీ 5204) రకం విత్తనాలు అమ్ముడయ్యాయి. అంతేకాక అపరాల పంటలైన పెసర కంది, మినుము విత్తనాలను కూడా విత్తనాభివృద్ధి సంస్థ విక్రయించింది.

వ్యాపారంలో 97 శాతం రికవరీ

విత్తనాభివృద్ధి సంస్థ ప్రస్తుత వానాకాలంలో చేపట్టిన వ్యాపారంలో ఇప్పటికే 97 శాతం రికవరీ నమోదైంది. ఖమ్మం జిల్లాలో 75, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 20 పీఏసీఎస్‌లతో పాటు ఖమ్మంలోని ఒక ప్రైవేట్ సంస్థ ద్వారా సంస్థ విత్తన వ్యాపారం నిర్వహించారు. ఆయా చోట్ల విత్తనాలు అమ్ముడవగానే నగదు రికవరీ చేశారు. సంస్థ ద్వారా 22,540 క్వింటాళ్ల విత్తనాలను విక్రయించి రూ.8.53 కోట్ల వ్యాపారం చేయగా, ఇందులో ఇప్పటికే రూ.8.24 కోట్లు వెనక్కి వచ్చేశాయి. ఇంకా రూ.29 లక్షల మేర పీఏసీఎస్‌ల నుంచి వసూలు కావాల్సి ఉంది.

ప్రస్తుత సీజన్‌లో విత్తనాభివృద్ధి సంస్థ చేపట్టిన విత్తన విక్రయాలు

విత్తనం	క్వింటాళ్లు	విలువ
జీలుగ	18,702	రూ.6.95 కోట్లు
జనుము	2,186	రూ.79 లక్షలు
పిల్లి పెసర	171	రూ.9.28 లక్షలు
వరి-బీపీటీ 5204	978	రూ.40.95 లక్షలు
ఎంటీయూ 1061	376	రూ.14.86 లక్షలు
ఆర్ఎన్ఆర్	04	రూ.16 వేలు
కేఎన్ఎం-1638	4.50	రూ.18 వేలు
ఎంటీయూ-1010	17	రూ.68 వేలు
పెసర	86.40	రూ.10.34 లక్షలు
మినుము	8.64	రూ.1.12 లక్షలు
కంది	4.60	రూ.69 వేలు
మొత్తం	22,538.14	రూ.8,52,26,000

అందుబాటులో అవసరమైన విత్తనాలు



ఉమ్మడి జిల్లాలో రైతులకు అవసరమైన విత్తనాలను సాధ్యమైనంత మేర అందుబాటులో ఉంచాం. రైతులు సాగుకు ప్రాధాన్యత ఇచ్చే పచ్చిరొట్ట విత్తనాలను సీజన్‌కు ముందుగానే సమకూర్చాం. 60 శాతం సబ్సిడీపై పచ్చి రొట్ట విత్తనాలతో పాటు ఐదు రకాల వరి విత్తనాలను విక్రయించాం. ప్రధానంగా సహకార సంఘాల ద్వారా వ్యాపారం ఎక్కువగా సాగింది.

– ఎస్.బిక్షం, ప్రాంతీయ మేనేజర్, విత్తనాభివృద్ధి సంస్థ, ఉమ్మడి ఖమ్మం జిల్లా

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యేలు



సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, ఆదినారాయణ, పాయం, పక్కన మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాంరెడ్డి తదితరులు

మణుగూరు టౌన్ / అశ్వారావుపేటరూరల్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యలను వివరించి అభివృద్ధి పనులను నిధులు కేటాయించాలని వినతిపత్రాలు అందజేశారు. అలాగే, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డిని కూడా ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎంను కలిసిన వారిలో సత్తుపల్లి, వైరా, అశ్వారావుపేట, పినపాక ఎమ్మెల్యేలు డాక్టర్ మట్టా రాగమయి, మాలోతు రాందాస్‌నాయక్, జారె ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ మువ్వా విజయబాబు తదితరులు ఉన్నారు. కాగా, సీఎం రేవంత్‌రెడ్డిని శుక్రవారం అశ్వారావుపేట జోన్ ఆయిల్ పామ్ గ్రోయర్స్ సొసైటీ రైతులు, సంఘం బాధ్యులు కలిసి మద్దతు ధర కల్పించడంతో పాటు ఆయిల్‌పామ్ బోర్డు, అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలకు అనుబంధంగా శిక్షణ కేంద్రం, ఖమ్మంలో రిఫైనరీ ఏర్పాటుచేయాలని కోరారు. నాయకులు జూలకంటి రంగారెడ్డి, తీగల సాగర్, మూడు శోభన్, తుంబూరి ఉమామహేశ్వరరెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య పాల్గొన్నారు.

బ్రిడ్జి మరమ్మతుల్లో జాప్యం జరగొద్దు

మైనింగ్ శాఖ డీఈ దినేష్



ఇసుక పూడికతీత పనులను పరిశీలిస్తున్న అధికారులు

కరకగూడెం: బ్రిడ్జి మరమ్మతు పనుల్లో జాప్యం జరగొద్దని మైనింగ్ డీఈ దినేష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన మండలంలోని చిరుమళ్ల బ్రిడ్జి వద్ద జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించి మాట్లాడారు. పెద్దవాగులో ఇసుక పూడికతీత పనులను ముమ్మరం చేశామని, బ్రిడ్జికి ఇరువైపులా రహదారికి కూడా పటిష్టంగా రక్షణ కల్పిస్తున్నట్లు వివరించారు. కాగా గతేదాది భారీ వర్షాలకు కోతకు గురైన బ్రిడ్జిని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఇటీవల సందర్శించి మరమ్మతు పనులకు సుమారు రూ.10 లక్షలు కేటాయించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ రమేష్, ఏఈఈ సక్రు, ఇన్‌చార్జి ఎంపీడీఓ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి ఆలయ చిత్రపటం బహూకరణ



ఆలయ చిత్రాన్ని ఈఓ రమాదేవికి అందజేస్తున్న లావణ్య

భద్రాచలంటౌన్: యాదాద్రి భువనగిరికి చెందిన నామోజు లావణ్య భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి ఆలయ చిత్రాన్ని లైవ్‌ఆర్ట్ ద్వారా అద్భుతంగా తీర్చిదిద్దింది. ఆయిల్ పెయింట్స్, యాక్రిలిక్ మిక్స్‌ను కాన్వాస్‌పై రకరకాల రంగులతో చిత్రీకరించి, శుక్రవారం ఈఓ ఈఓ రమాదేవికి అందజేసింది. ఈ సందర్భంగా ఈఓ లావణ్యను శాలువతో ఘనంగా సత్కరించారు.

రెగ్యులర్ మెజిస్ట్రేట్‌ను నియమించాలి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం మొబైల్ కోర్టుకు రెగ్యులర్ మెజిస్ట్రేట్‌ను నియమించాలని భద్రాచలం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సచివాలయంలో లా సెక్రటరీ తిరుపతికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చైతన్య, మాజీ అధ్యక్షుడు వసంతరావు, న్యాయవాదులు పాయం రవివర్మ, గౌతమ్ కుమార్ పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు

కల్లూరురూరల్: కల్లూరు మండలంలోని లక్ష్మీపురం కుటుంబ కలహాల కారణంగా జరిగిన దాడి ఘటనపై పోలీసులు కేసు నమోదుచేశారు. గ్రామానికి చెందిన ధరావత్ కృష్ణ కుటుంబంలో కొన్నాళ్ల గొడవలు జరుగుతున్నాయి. ఈనేపథ్యాన కృష్ణ, ఆయన భార్యతో సోదరుడు లాలు గొడవ పడి కొట్టాడు. ఈమేరకు బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షాకీర్ శుక్రవారం తెలిపారు.

పనిచేయని ఎక్స్‌రే యంత్రం



ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రిలో ఎక్స్‌రే యంత్రం మూడు రోజులుగా పనిచేయడంలేదు. ఇటీవల వరకు డయాలసిస్ యంత్ర వారం రోజులపాటు పనిచేయలేదు. ఏరియా ఆస్పత్రికి రోజూ 50 నుంచి 100 వరకు ఎక్స్‌రే కోసం వస్తుంటారు. వారంతా గత మూడు రోజులుగా ఆస్పత్రి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ విషయమై సూపరింటెండెంట్ డాక్టర్ హర్షవర్ధన్‌ను వివరణ కోరగా.. టెక్నీషియన్‌కు సమాచారం ఇచ్చామని, అతను రావాల్సి ఉందని తెలిపారు.

మెడికల్ అన్‌ఫిట్ దందా!

- జెన్‌కో సంస్థలో అనారోగ్యం పేరుతో వారసులకు ఉద్యోగాలు
- రూ.లక్షలు ముట్టజెప్పి అన్‌ఫిట్ సర్టిఫికెట్లు పొందుతున్న వైనం



కేటీపీఎస్ కాంప్లెక్స్

పాల్వంచ: టీజీ జెన్‌కో సంస్థలో మెడికల్ అన్‌ఫిట్ పేరుతో వారసులను ఉద్యోగాల్లో చేర్పించేందుకు జోరుగా పైరవీలు సాగుతున్నాయి. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ, విధులు నిర్వర్తించలేని వారు మెడికల్ అన్‌ఫిట్‌కు దరఖాస్తు చేసుకుంటారు. వైద్యనిపుణులతో పరీక్షలు చేయించుకుని, అన్‌ఫిట్ సర్టిఫికెట్ పొంది బోర్డుకు సమర్పిస్తే, యాజమాన్యం జీఓ నంబర్ 6 ప్రకారం వారి వారసులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తుంది. అయితే మెడికల్ అన్‌ఫిట్‌ను ఆసరా చేసుకుని పలువురు అనర్హులు పైరవీలతో ఉద్యోగాలకు ప్రయత్నించిన ఘటనలు వెలుగుచూశాయి. దీంతో 2020లో ఈ జీఓను అప్పటి ప్రభుత్వం రద్దు చేసింది. కొత్త ప్రభుత్వం ఇటీవల జీఓ నంబర్ 6ను పునఃరుద్ధరించడంతో మళ్లీ అనర్హులు పైరవీ బాటపట్టినట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లోని పేరు మోసిన ఆస్పత్రుల్లో మధ్యవర్తుల సాయంతో రూ. లక్షలు ముట్టజెప్పి మెడికల్ అన్‌ఫిట్ తెచ్చుకోవడం బహిరంగ రహస్యంగా మారింది. గుండె, రక్త ప్రసరణ, ఇతర అవయవాలు పనిచేయడంలేదంటూ సర్టిఫికెట్లు పొందుతుండగా, యాజమాన్యం ఉద్యోగ విరమణకు అవకాశం కల్పిస్తోంది. వారి వారసులను ఉద్యోగాల్లో నియమిస్తోంది. ఈ వ్యవహారం కొందరు నేతల కనుసన్నల్లో నడుస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అనర్హులు పింఛన్, సెటిల్‌మెంట్ అమౌంట్‌తోపాటు వారసులకు ఉద్యోగాలు పొందుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఈ దందాపై విజిలెన్స్ విచారణ చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై కేటీపీఎస్ 7వ దశ సీఈ పి.వెంకటేశ్వరరావును వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. అందుబాటులో లేరు.

అటవీశాఖ వైల్డ్‌లైఫ్ ఉద్యోగుల బదిలీకి కసరత్తు

పాల్వంచరూరల్: అటవీశాఖలో బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. బదిలీలు చేపట్టాలని ఇటీవల ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగా, వైల్డ్‌లైఫ్, టెరిటోరియల్ అటవీ డివిజన్లలో విధులు నిర్వహించే ఉద్యోగులు ఆప్షన్లు ఎంచుకుంటున్నారు. పాల్వంచలోని వన్యమృగాల సంరక్షణ విభాగం(వైల్డ్‌లైఫ్) డివిజన్‌లో వివిధ విభాగాల్లో ఐదేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు అధిక సంఖ్యలో ఉన్నారు. జిల్లాలో ఆరు అటవీ డివిజన్లు ఉండగా, వైల్డ్‌లైఫ్ డివిజన్‌లోనే ఎక్కువగా 42 మంది బదిలీ కానున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఐదేళ్ల సర్వీస్‌దాటిన వారిలో యానంబైల్, చాతకొండ, ఆళ్లపల్లి రేంజర్లు శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, నర్సింహారావు, 29 మంది ఫారెస్ట్ బీట్‌ఆఫీసర్లు, ముగ్గురు డిప్యూటీ రేంజర్లు, ఏడుగురు సెక్షన్‌ఆఫీసర్లున్నారు. పాల్వంచ ఫారెస్ట్ డివిజన్‌లో 34 మంది బదిలీ కానున్నారు. ఇందులో ఒక రేంజర్, డిప్యూటీరేంజర్‌తోపాటు మరో 32 మంది ఉద్యోగులు ఉన్నారు. కాగా ఉద్యోగుల సంఖ్యలో బదిలీలు 40 శాతమా లేకా వందశాతం చేపట్టాలనే విషయమై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. దీనిపై ప్రభుత్వం జీఓ జారీ చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో శుక్రవారం జిల్లా అటవీశాఖ కార్యాలయంలో నిర్వహించాల్సిన కౌన్సెలింగ్‌ను ఈ నెల 16వ తేదీకి వాయిదా వేసినట్లు సమాచారం.

రోడ్డుకు స్వచ్ఛందంగా మరమ్మతులు



మట్టి తరలించి గుంతలు పూడ్చిన స్థానికులు

మణుగూరు టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురం కట్ట చివరన రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. మున్సిపల్ కమిషనర్‌కు విన్నవించగా, మట్టి తరలించి మరమ్మతులు చేపట్టారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. వర్షాలకు గుంతల్లో నీరు నిలిచి మోటార్‌సైకిళ్లు, పాదచారులు తిరగలేని పరిస్థితి నెలకొంది. దీంతో శుక్రవారం స్థానికులే మరమ్మతులు చేసుకున్నారు. కాంగ్రెస్ నాయకులు సారంపల్లి రాంరెడ్డి, బానోత్ లక్ష్మణ్, స్థానికులు శ్రీరాం వాటర్‌ప్లాంట్ నిర్వాహకులు తాటిపల్లి యశ్వంత్, సునీల్, సోను, ఉమేశ్, అరుణ్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా మరమ్మతులు పూర్తిచేశారు.

కేఓసీ యార్డులో లారీ చోరీ

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టు బొగ్గు లోడింగ్ కోసం యార్డులో ఉంచిన లారీ చోరీకి గురైంది. బోడు ఎస్ఐ పొడిశెట్టి శ్రీకాంత్ కథనం ప్రకారం.. ఇల్లెందు స్టేషన్‌బస్తీకి చెందిన ఎండీ ఖాజా సలీముద్దీన్ బొగ్గు లోడ్ సీరియల్ కోసం లారీని ఈ నెల 8న కేఓసీ చెక్‌పోస్టు వద్ద గల లారీ యార్డులో ఉంచి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం వచ్చి చూడగా యార్డులో లారీ కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా లారీ విలువ రూ.8 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

గోతిలో పడి తీవ్ర అవస్థ



దమ్మపేట: రహదారి పక్కన ఉన్న గోతిలో పడిన గేదె తీవ్ర అవస్థకు గురైంది. మండల పరిధిలోని పట్వారిగూడెం గ్రామంలో రోడ్డు పక్కన టెలికాం సర్వీసుల మరమ్మతుల నిమిత్తం గోతులు తవ్వి, పూడ్చకుండా వదిలేశారు. శుక్రవారం మేతకు వెళ్తున్న గేదె గోతిలో పడి ఇరుక్కుపోయింది. స్థానికులు జేసీబీ సాయంతో గేదెను క్షేమంగా బయటకు తీశారు. టెలికాం సర్వీసుల వారు గోతులను పూడ్చకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

4.5 కేజీల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కొత్తగూడెంటౌన్: బైక్‌పై తరలిస్తున్న గంజాయిని శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొత్తగూడెం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ టీ.రమేష్‌కుమార్ వివరాలు వెల్లడించారు. సీఐ కథనం ప్రకారం.. రామవరం సుభాష్‌చంద్రబోస్ నగర్‌లో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. బైక్‌పై కొత్తగూడెం నుంచి రుద్రంపూర్ వెళ్తున్న ముగ్గురు వ్యక్తులను ఆపి తనిఖీ చేయగా 4.5 కేజీల గంజాయి లభించింది. విచారించగా రుద్రంపూర్‌కు చెందిన శివ, జూలూరుపాడు అనంతారానికి చెందిన వనమాల వేణుతోపాటు మరో మైనర్ బాలుడు కలిసి రూ.1.22 లక్షల విలువైన గంజాయిని రుద్రంపూర్‌కు తరలిస్తున్నట్లు తేలింది. దీంతో గంజాయి, ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అల్యూమినియం కండక్టర్ వైరు చోరీ

వైరా: వైరాలోని మార్కెట్ ఎదురుగా గోదాంలో నిల్వ ఉంచిన అల్యూమినియం కండక్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి అపహరించారు. పోలీసుల కథనం మేరకు.. గ్రీన్‌ఫీల్డ్ హైవే విద్యుత్ కాంట్రాక్టును సఖి ఎంటర్‌ప్రైజెస్ బాధ్యులు దక్కించుకున్నారు. ఈ సంస్థే వైరాలోని గోదాం అద్దెకు తీసుకుని విద్యుత్ సామగ్రిని నిల్వచేశారు. గురువారం రాత్రి ఓ వ్యక్తి ట్రాలీ ఆటోతో చేరుకుని గోదాం వెనుక తలుపు తాళాలు పగలగొట్టి సుమారు 250 కిలోల బరువైన ట్రిబుల్ అల్యూమినియం కండక్టర్ వైరు చోరీకి యత్నించాడు. ఈక్రమంలో సమీపాన ఉన్న అయ్యప్ప అనే వ్యక్తి అడ్డుకునే ప్రయత్నం చేయగా తప్పించుకుని రూ.58వేల విలువైన వైరుతో సహా పరారయ్యాడు. ఈవిషయమై సైట్ ఇంజనీర్ అజ్మీరా వీరబాబు పోలీసులు ఫిర్యాదు చేయడంతో సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. కాగా, కొన్నిరోజుల క్రితం గోదాం ఆవరణలోని రూ.2.20లక్షల విలువైన 106 ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ బీడు పైపులను కూడా గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు తెలిసింది. వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఓ ప్రాంతానికి చెందిన వ్యక్తులే చోరీలకు పాల్పడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

విద్యార్థిని ఆత్మహత్య

సుజాతనగర్: పాఠశాలకు వెళ్లాలని తల్లిదండ్రులు మందలించడంతో శుక్రవారం ఓ బాలిక ఆత్మహత్య చేసుకుంది. కొత్తగూడెం టూ టౌన్ పోలీసుల కథనం ప్రకారం .. మండల పరిధిలోని గరీబ్‌పేట గ్రామానికి చెందిన బుర్రా లిడియా(12) పాల్వంచ గురుకుల పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. 10 రోజుల క్రితం బాలిక పాఠశాలకు వెళ్లగా జ్వరం వచ్చింది. దీంతో ఇంటికి వచ్చిన బాలికను జ్వరం తగ్గిన అనంతరం పాఠశాలకు వెళ్లాలని తల్లిదండ్రులు సూచించారు. పాఠశాలకు వెళ్లడం ఇష్టం లేని బాలిక మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని గురువారం ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కబడ్డీ సీనియర్ క్రీడాకారుడు మృతి



నాగేశ్వరరావు (ఫైల్)

అశ్వాపురం: మండల పరిధిలోని గొందిగూడెం గ్రామానికి చెందిన కబడ్డీ సీనియర్ క్రీడాకారుడు వర్సా నాగేశ్వరరావు(60) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. 1985 నుంచి కబడ్డీలో రాష్ట్రస్థాయిలో రాణిస్తున్న నాగేశ్వరరావు 1995లో ఐడీడీఏలో ఉద్యోగిగా చేరాడు. గొందిగూడెంలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించి స్థానికుల నుంచి ప్రశంసలు పొందాడు. నాగేశ్వరరావు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎంపీపీ ముత్తినేని సుజాత, ఎంపీటీసీ చిట్టెమ్మ, మాజీ సర్పంచ్‌లు పాయం భద్రమ్మ, పొడియం సుజాత, అనిల్, గిరిజన సంఘాల నాయకులు, గిరిజనులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

ప్రాణం తీసిన ఫ్యాన్

కారేపల్లి: పూరిగుడిసెలో కిందకు ఉన్న ఫ్యాన్ రెక్కలు తాకడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన కారేపల్లి మండలం సూర్యతండాలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జర్పుల శంకర్(55) రైల్వే పని చేస్తుంటాడు. సూర్యతండాలో పూరిగుడిసెలో నివాసముంటుండగా, ఆయన భార్య కుమార్తె వద్దకు వెళ్లింది. శుక్రవారం పనికి వెళ్లొచ్చిన శంకర్ ఫ్యాన్ వేసి నిద్రించేందుకు ఉపక్రమిస్తుండగా ప్రమాదవశాత్తు ఫ్యాన్ రెక్కలు మెడకు తగలడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. ఆ సమయాన ఫ్యాన్ శబ్దం పెద్దగా రావడంతో గుర్తించిన స్థానికులు వచ్చేసరికి శంకర్ మెడకు గాయాలై మృతి చెంది ఉన్నాడు. ఘటనపై ఆయన భార్య ఈరి ఫిర్యాదుతో కేసునమోదు చేసినట్లు కారేపల్లి ఎస్సై ఎన్.రాజారాం తెలిపారు.